
మంగళవారం
03 -02- 2026
విజయనగరం : ప్రచురణ
సంపుటి : 02 సంచిక : 320
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by :
Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com
స్థాపితం : 2008
RNI No. APTEL/2008/24928
Postal Registration No. : VZM/22/2020-2022
Period of Renewal. : 01-01-2023 to 31-12-2025

# ప్రజాస్వామ్యం
తెలుగు దినపత్రిక
PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)



న్యూస్ పేపర్స్ యాజమాన్యానికి శుభవార్త


అతి తక్కువ ధరలకే బ్లాక్ అండ్ వైట్, మల్టీకలర్ దినపత్రికలు, వార పత్రికలు, పక్ష పత్రికలు మరియు మాస పత్రికలు ప్రింటింగ్ చేయబడును
ఇట్లు
ప్రజాస్వామ్యం తెలుగు దినపత్రిక ప్రింటింగ్ యూనిట్
Cell : 93470 64455


## వెనెజువెలా చమురు కొనుగోలుకు భారత్ సిద్ధం!




"చమురు విషయంలో ఒప్పందం కుదుర్చుకోవడానికి మేము చైనాను స్వాగతిస్తున్నాం,

భారత్ ఇకపై ఇరాన్ నుంచి కాకుండా వెనెజువెలా నుంచి చమురును దిగుమతి చేసుకుంటుంది.

న్యూయార్క్: వెనెజువెలా నుంచి చమురు దిగుమతులకు భారత్ ముందుకొచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వెనెజువెలాకు చైనా ఇచ్చిన అప్పును తిరిగి చమురు రూపంలో పొందనుందా.. అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ "చమురు విషయంలో ఒప్పందం కుదుర్చుకోవడానికి మిగతా..2లో

## ఇరాన్‌పై దాడి చేస్తే 'ప్రాంతీయ యుద్ధం'



ఖమేనీ హెచ్చరిక

ఈయూ దేశాల సైన్యాలన్నీ ఉగ్రసంస్థలే!

దుబాయ్: అమెరికా తమపై దాడికి పాల్పడితే అది పశ్చిమాసియాలో ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. "మేం యుద్ధ ప్రేరేపకులం కాదు. కానీ తమపై దాడికి పాల్పడేవారికి ఇరాన్ గట్టిగా సమాధానం చెబుతుంది" అని ఖమేనీ అన్నారు. యుద్ధనౌకలను ట్రంప్ యంత్రాంగం రంగంలోకి దించాక ఖమేనీ ఇంత సూటిగా అమెరికాను హెచ్చరించడం ఇదే ప్రథమం. అయితే అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై బలప్రయోగం చేస్తారా లేదా అన్నది ఇంకా ఇదమిత్థంగా తేలలేదు. ఇరాన్ తమతో చర్చలకు సిద్ధమవుతోందంటున్న ట్రంప్, టెహ్రాన్ అనుసరిస్తున్న అణ్వాయుధ విధానం వల్ల తలెత్తుతున్న సమస్యను కూడా తానే పరిష్కరిస్తానని అంటున్నారు. మిగతా..2లో

## వంగవీటి రంగాతో అంబటి రాంబాబును పోల్చడం దారుణం




- వైసీపీ భ్రష్టు పట్టిపోయిందన్న కొల్లు రవీంద్ర
- కులాలు, మతాల పేరుతో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపాటు
- అంబటిపై దాడిని కులానికి రుద్దే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని వ్యాఖ్య

అమరావతి : వైసీపీ పార్టీ భ్రష్టు పట్టిపోయిందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆ పార్టీపై రోజురోజుకూ ప్రజా వ్యతిరేకత పెరుగుతోందని చెప్పారు. ప్రజాగ్రహం కారణంగానే అంబటి రాంబాబు నివాసంపై దాడి జరిగిందని అన్నారు. ప్రజాగ్రహాన్ని తట్టుకోలేక కులాలు, మతాల పేరుతో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

## హింసను ప్రేరేపించేందుకు వైఎస్సార్సీపీ కుట్ర

# వారి ట్రాప్ లో పడొద్దు

- పార్టీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- అధికారం కోల్పోయామనే అసహనంతో వైఎస్సార్సీపీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజం
- వైఎస్సార్సీపీ ట్రాప్ లో పడకుండా జాగ్రత్త తీసుకోవాలని సీనియర్ నేతలకు సూచన



అమరావతి : బూతు మాటలపై టీడీపీ శ్రేణుల నిరసనలు ఉద్రిక్తతకు దారితీసిన నేపథ్యంలో తెలుగుదేశం సీనియర్ నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైఎస్సార్సీపీ కుట్రలు పన్నుతోందని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయామనే అసహనంతో మిగతా..2లో

## అంబటి కుటుంబ సభ్యులు

# నిలదీయాల్సింది జగన్‌నే

- కాపులను ఓటు యంత్రాలుగానే ఆ పార్టీ వాడుకుంటోందని మండిపడ్డారు.
- అంబటి కుటుంబ సభ్యులు, సానుభూతి పరులు జగన్‌ను నిలదీయాలన్నారు.



అమరావతి: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారాన్ని డైవర్ట్ చేయడానికే అంబటి రాంబాబును వైకాపా అధినేత జగన్ పావులా వాడుకున్నారని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. ఈ విషయంలో అంబటి కుటుంబ సభ్యులు, సానుభూతి పరులు జగన్‌ను నిలదీయాలన్నారు. కావులను ఓటు యంత్రాలుగానే ఆ పార్టీ వాడుకుంటోందని మండిపడ్డారు. కాపు రిజర్వేషన్‌ను జగన్ రద్దు చేస్తున్నప్పుడు అంబటి నోరెత్తలేదని విమర్శించారు. మిగతా..2లో

## చీరపై కాదు బడ్జెట్‌పై దృష్టి పెట్టండి ఇదే ప్రశ్న వారిని అడిగేవారా




- బడ్జెట్ వేళ తన చీర గురించి చర్చ జరగడంపై నిర్మలాసీతారామన్ మండిపాటు
- పురుషమంత్రులను కూడా ఇలా దుస్తుల గురించి అడుగుతారా అని నిలదీత
- బడ్జెట్‌పై దృష్టిపెట్టాలని, తన చీరలపై కాదని హితవుపలికిన నిర్మల

ఢిల్లి : ప్రతీసారి బడ్జెట్ కేటాయింపుల వేళ పార్లమెంటులో తాను ధరించిన చీరలపై చర్చలు జరగుతుండటంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. బడ్జెట్ రోజు

## జాతీయ భద్రతకు సంబంధించిన

# విషయం మాట్లాడుతుంటే అడ్డుకున్నారు

అవి మాట్లాడితే అంతా తెలిసిపోయేదని తనను ఎందుకు మాట్లాడనివ్వట్లేదని కేంద్రాన్ని ప్రశ్నించిన రాహుల్




ఢిల్లి: పార్లమెంట్‌లో జాతీయ భద్రతకు సంబంధించిన విషయాన్ని మాట్లాడాలని యత్నిస్తే తనను అడ్డుకున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. భారత సరిహద్దుల్లోకి చైనా సైన్యం చొరబడుతోందనేవి తాను చెప్పే మాటలు కాదని, స్వయంగా ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే తన పుస్తకంలో రాశారని వెల్లడించారు. ఈ పుస్తకం బయటకు వస్తే అసలు విషయాలు ప్రజలకు తెలిసిపోతాయనే భయంతో ఆ పుస్తక ప్రచురణను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. లోక్‌సభ వాయిదా పడిన అనంతరం బయట మీడియాతో మాట్లాడిన రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. నరవణే రాసిన పుస్తకం పబ్లిష్ అయితే ప్రభుత్వ నేతలు మన సైన్యాన్ని ఎలా నిరాశపరిచారనే విషయాలు ప్రజలు తెలుసుకుంటారని రాహుల్ గాంధీ తెలిపారు. డోక్లాం అంశంలో ఆర్మీ మాజీ చీఫ్ రిటైర్డ్ జనరల్ ముకుంద్ నరవణే ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ఏం మాట్లాడారో చెప్పేందుకు యత్నించానని పేర్కొన్నారు. అవి మాట్లాడితే అంతా తెలిసిపోయేదని తనను ఎందుకు మాట్లాడనివ్వట్లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. "నన్ను మాట్లాడనివ్వడం లేదు. నేను కేవలం రెండు మూడు వాక్యాలు మాత్రమే మాట్లాడాల్సి ఉంది. అవి మాట్లాడితే అంతా తెలిసిపోతుంది. కానీ నన్ను మాట్లాడనివ్వలేదు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన విషయం. ఇవి ఆర్మీ మాజీ చీఫ్ చెప్పిన మాటలు. రాజ్‌నాథ్ సింగ్‌తో, ప్రధాని మోదీతో ఆయన జరిపిన సంభాషణ. నేను చెప్పేదల్లా ఒక్కటే, ఆర్మీ మాజీ చీఫ్ ఏం రాశారో, రాజ్‌నాథ్ సింగ్, ప్రధాని మోదీ ఆయనకు ఎలాంటి ఆదేశాలు ఇచ్చారో మిగతా..2లో

## తెలుగు రాష్ట్రాలకు 'గేమ్ ఛేంజర్' గా హైస్పీడ్ రైళ్లు

# హైదరాబాద్ నుంచి 2గంటల్లోనే!

- అసోం, ఈశాన్య రాష్ట్రాల్లో రూ. 72,468 కోట్లతో రైల్వే ప్రాజెక్టులు
- కొత్త రైల్వే ప్రాజెక్టులు, వంతెనల గురించి సర్వే జరుగుతోంది
- భూటాన్‌కు అనుసంధాన ప్రాజెక్టులు చేపడుతున్నాం



ఢిల్లి : దేశంలో ఇకపై హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కి.మీ వేగంతో పరుగులు పెడతాయని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. "హైదరాబాద్ నుంచి చెన్నై, పుణె, బెంగళూరుకు 3హైస్పీడ్ రైళ్లు వేస్తాం. దీనితో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో, పుణెకు 1.55 గంటల్లో, చెన్నైకు 2.55 గంటల్లో చేరుకోవచ్చు. హైస్పీడ్ కారిడార్‌తో ఏపీ-తెలంగాణ-తమిళనాడు మధ్య ఆర్థిక, వైద్య, ఆరోగ్య, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయి. హైస్పీడ్ రైళ్లు తెలుగు రాష్ట్రాలకు గేమ్ ఛేంజర్‌గా మారతాయి" అని వైష్ణవ్ తెలిపారు. అలాగే అసోం, ఈశాన్య రాష్ట్రాల్లో రూ.72,468 కోట్లతో రైల్వే ప్రాజెక్టులు చేపడతామని వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం కొత్త రైల్వే ప్రాజెక్టులు, వంతెనల గురించి సర్వే జరుగుతోందన్నారు. భూటాన్‌కు అనుసంధాన ప్రాజెక్టులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

### అండర్ గ్రౌడ్ రైల్వే ట్రాక్

బంగాల్‌లోని సిలిగురి మీదుగా ఈశాన్య ప్రాంతాన్ని భారత్‌తో కలిపే ఈ ఇరుకైన భూభాగాన్ని 'చికెన్స్ నెక్' అని పిలుస్తారు. ఇది భారత్ కు చాలా వ్యూహాత్మక ప్రాంతం. అందుకే భారత్ తో ఈశాన్య రాష్ట్రాలను అనుసంధానం చేసేందుకు 40 కి.మీ మేర భూగర్భ రైల్వే ట్రాకుల నిర్మాణానికి కేంద్రం ప్రణాళిక వేసిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. మిగతా..2లో

## బొగ్గు గనులను ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించడం లేదన్న తమిళనాడు ఎంపీ



- 2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు కేటాయించినట్లు వెల్లడి
- రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ గురించి స్పందించిన కేంద్రమంత్రి

హైదరాబాద్ : తాడిచెర్ల-1 బొగ్గు గనుల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. 2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు దీనిని కేటాయించినట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి

# రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

- బడ్జెట్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి ధ్వజం
- 'మూసీ', మెట్రో విస్తరణకు ఏమీ ఇవ్వలేదు
- బయోఫార్మా, సెమీ కండక్టర్ పరిశ్రమలూ గుర్తుకురాలేదని వ్యాఖ్య



హైదరాబాద్: వికసిత్ భారత్ లక్ష్యాలను చేరడానికి బడ్జెట్‌లో ప్రోత్సాహం ఇవ్వాల్సింది పోయి పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. సంక్షేమంపై కేంద్రం దృష్టి సారించలేదని...ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి ఏమీ చేయలేదని ఆరోపించారు. ఉపాధి హామీ పథకానికి పూర్తిగా తూట్లు పొడవడం వల్ల గ్రామీణ పేదలకు నష్టం జరుగుతుందని విమర్శించారు. ఆదివారం ప్రజాభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. "తెలంగాణ కోసం బడ్జెట్‌లో ఏదైనా ఉంటుందని ఆశపడ్డాం. సీఎంతో సహా మంత్రులమంతా ఎంపీల బృందంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిశాం. మూసీ పునరుజ్జీవం, రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్), మెట్రో విస్తరణ వంటి ప్రాజెక్టులకు నిధులిస్తారనుకున్నాం.. ఏమీ ఇవ్వలేదు. బయోఫార్మా రంగంలో అయినా కేంద్రానికి తెలంగాణ గుర్తుకు రావాలి కదా. సెమీ కండక్టర్ పరిశ్రమకూ మొండిచేయి చూపారు.

### మరోసారి ప్రధానిని కలుస్తాం

రైజింగ్ తెలంగాణ నినాదంతో ప్రపంచంతో పోటీపడాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కేంద్రం ప్రోత్సహించకుండా నిర్లక్ష్యం చూపుతోంది. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు న్యాయం చేయాలని రాష్ట్ర ఎంపీలంతా పార్టీలకు అతీతంగా మరోసారి ఆర్థికశాఖ మంత్రి, ప్రధానిని కలిసి అడగాలని ప్రభుత్వం భావిస్తోంది. జీఎస్‌డీపీలో ఆర్థిక ద్రవ్యలోటు పరిమితిని మిగతా..2లో

## మళ్లీ ఉద్యమ రోజులు

# గుర్తుకొచ్చాయి



రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు కదిలారని

రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్: కేసీఆర్‌కు సిట్ నోటీసులను నిరసిస్తూ ఆదివారం రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు కదిలారని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మళ్లీ ఉద్యమ రోజులు గుర్తుకొచ్చాయని చెప్పారు. పార్టీ క్యాడర్‌కు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో పాలనా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని కేటీఆర్ అన్నారు. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## జాతీయ భద్రతకు సంబంధించిన విషయం
# మాట్లాడుతుంటే అడ్డుకున్నారు

ఆ విషయాలను సభలో చెప్పాలనుకుంటున్నాను. ఎందుకు వాళ్లు ఇంతలా భయపడుతున్నారో అర్థం కావడం లేదు."

### రాహుల్‌గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత

"ఇది నేను చెప్పింది కాదు, మాజీ ఆర్మీ చీఫ్ ఒక పుస్తకంలో రాశారు. అయితే, ఆ పుస్తకాన్ని ప్రచురించేందుకు అనుమతించడం లేదు. అది అలాగే పక్కకు పడిపోయింది. ఆర్మీ చీఫ్ దృక్కోణాన్ని వెల్లడిస్తుంది. అయినా ఆర్మీ చీఫ్ చెప్పినదానికి ఎందుకు భయపడుతున్నారు. దాని నుంచి మనం ఏదో ఒకటి నేర్చుకుంటాం. కచ్చితంగా, మనం ప్రధానమంత్రి, రాజ్‌నాథ్ సింగ్ గురించి మాత్రం ఏదో ఒకటి తెలుసుకుంటాం. అలాగే మన సైన్యాన్ని దేశ రాజకీయ నాయకత్వం ఎలా నిరాశపరిచిందో కూడా నేర్చుకుంటాం. నరవణే తన పుస్తకంలో ప్రధానమంత్రి, రాజ్‌నాథ్ సింగ్ గురించి స్పష్టంగా రాశారని నేను చెబుతున్నాను. అది ఒక వ్యాసంలో వచ్చింది. నేను ఆ వ్యాసాన్ని ఆధారంగా చూపిస్తున్నాను. వారు నన్ను మాట్లాడనివ్వడం లేదు. వారు భయపడుతున్నారు, ఎందుకంటే అది బయటకు వస్తే, నరేంద్ర మోదీ, రాజ్‌నాథ్ సింగ్ వాస్తవ విషయాలు ప్రజలకు అర్థమవుతాయి." అని రాహుల్ గాంధీ అన్నారు.

### ఎందుకు భయపడుతున్నారు?: ప్రియాంక గాంధీ

మరోవైపు రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఆయన సోదరి, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ స్పందించారు. రాహుల్ మాట్లాడుతున్న మాటల్లో నిజం లేకపోతే, వాటికి సరైన ప్రామాణికత లేకపోతే కేంద్ర ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. పుస్తకంలోని ఒక్క లైన్ గురించి రాహుల్ ప్రస్తావించగానే అధికార పక్ష సభ్యులు అంత ఆగ్రహానికి గురవ్వాల్సిన అవసరం ఏముందని అన్నారు.

## వంగవీటి రంగాతో
# అంబటి రాంబాబును పోల్చడం దారుణం

వంగవీటి రంగాతో అంబటిని పోల్చడం దారుణమని అన్నారు. ప్రజల కోసం నిలబడిన రంగా స్థాయి ఏమిటి రోడ్డు పక్కన నిలబడి మాట్లాడే అంబటి రాంబాబు స్థాయి ఏమిటి? అని ప్రశ్నించారు. అంబటిపై దాడిని కులానికి రుద్దే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని అన్నారు. అంబటిని ప్రతి ఒక్కరూ చీదరించుకుంటున్నారని చెప్పారు. సభ్యసమాజం తల దించుకునేలా వైసీపీ నేతల ప్రవర్తన ఉందని రవీంద్ర అన్నారు. పేదల రేషన్ బియ్యం బొక్కేసిన పేర్ని నాని సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీసీలు అంటూ జోగి రమేశ్ మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందని అన్నిరు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలమైన తమపై దాడులు జరిగాయని, అప్పట్లో తమ అరెస్ట్ లు జరిగినప్పుడు జోగి రమేశ్ ఏమయ్యాడని ప్రశ్నించారు. తప్పు చేసిన ప్రతి ఒక్క వైసీపీ నేతపై కేసులు పెట్టి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## అంబటి కుటుంబ సభ్యులు నిలదీయాల్సింది జగన్‌నే

మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో నిమ్మల మీడియాతో మాట్లాడారు. "ముద్రగడ పద్మనాభ రెడ్డి అని పేరు పెట్టుకున్న వ్యక్తికి ఇవాళ కాపుల గురించి లేఖ రాసే అర్హత ఎక్కడుంది..? చంద్రబాబు తల్లిదండ్రులను ఉద్దేశించి నోరు పారేసుకుంటున్న అంబటికి అతని కుటుంబసభ్యులు ఆరోజే తప్పని ఎందుకు చెప్పలేకపోయారు? కులాలను రెచ్చగొట్టి చిచ్చుపెట్టేందుకే వైకాపా కులం కార్డులు తీస్తోంది. కాపుల సంక్షేమం, భవిష్యత్తు తెలుగుదేశం పార్టీతోనే ముడిపడి ఉన్నాయని చరిత్ర చెప్తోంది" అని నిమ్మల అన్నారు.

# రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

4 శాతానికి పెంచాలని కోరినా పట్టించుకోలేదు. కేంద్రానికి మాత్రం 4.3 శాతం పెట్టుకున్నారు. దానినే రాష్ట్రాలకు కూడా వర్తింపజేయాలి కదా. గేమింగ్ పరిశ్రమకు హైదరాబాద్ కేంద్రంగా ఉంది. అయినా ఈ నగరంపై దృష్టి పెట్టలేదంటే తెలంగాణ ఏం తప్పు చేసింది? దేశంలో హైదరాబాద్ మెడికల్ హబ్‌గా ఉంది. ఇతర దేశాల నుంచి సైతం ఇక్కడికి రోగులు వస్తున్నారు. ప్రాంతీయ మెడికల్ హబ్‌ల ఏర్పాటులో కూడా రాష్ట్రానికి చోటు లేదు. నగరంలో 56 కిలోమీటర్ల దూరం మూసీ పునరుజ్జీవంతో ఇన్‌ల్యాండ్ వాటర్ ప్రాజెక్టు కోసం నిధులు ఇవ్వాలని ప్రధానిని సైతం అడిగాం. అయినా బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారు.

### రేర్ ఎర్త్ ఖనిజాల ఉత్పత్తిని పట్టించుకోలేదు

రామప్ప వంటి అద్భుత దేవాలయాలతో పాటు, టైగర్ రిజర్వులు, ఇరువైపులా నదులు, జలపాతాల వంటివి అనేకమున్నా రాష్ట్రానికి టూరిజం నిధుల కేటాయింపులో కూడా పట్టించుకోకపోవడం బాధాకరం. రేర్ ఎర్త్ ఖనిజాలపై దృష్టి సారించే అవకాశమున్న ప్రతిచోటుకు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు వెళ్లాలని ప్రయత్నం చేస్తున్నా పట్టించుకోలేదు. సత్తుపల్లి, రామగుండం వంటి ప్రాంతాల్లో సింగరేణి తవ్విన మట్టిలో ఇవి ఉన్నాయి. మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో సెమీ కండక్టర్లపై కొన్ని దేశాలు గుత్తాధిపత్యం సాధించే పరిస్థితి వస్తోంది. ఆయా దేశాలు సరఫరా చేస్తే తప్ప ఎలక్ట్రానిక్ పరికరాలు ఉత్పత్తి చేసే పరిస్థితి ఉండదు. అటువంటి పరిస్థితి నుంచి మనదేశం బయటపడాలనే రేర్ ఎర్త్ ఖనిజాల ఉత్పత్తికి తెలంగాణకు అవకాశం ఇవ్వాలని కోర్యా. దీనివల్ల దేశానికి ఉపయోగమని కేంద్రానికి చెప్పాం. అయినా పట్టించుకోలేదు. మూడు రైలు మార్గాలు మాత్రమే ఇచ్చినా...ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటానికి కనీసంగా రావాల్సినవి రాలేదు" అని ఉప ముఖ్యమంత్రి భట్టి తెలిపారు.

## 2015 ఆగస్ట్ 31న తెలంగాణ
# విద్యుత్ సంస్థకు కేటాయించినట్లు వెల్లడి

2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆమోదం అనంతరం, 2020 జూన్ నుంచి బొగ్గు గనుల కేటాయింపుల ప్రక్రియ మారినట్లు తెలిపారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ గురించి కేంద్రమంత్రి స్పందించారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కేంద్ర బడ్జెట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, ఇది తెలంగాణ ప్రజలను నిరాశపరిచిందని అన్నారు. 2020 జూన్ నుంచి బొగ్గు వేలం ప్రక్రియలో ప్రభుత్వరంగ సంస్థలకు బొగ్గు బ్లాక్‌లు కేటాయించలేదని తమిళనాడుకు చెందిన ఎంపీ డాక్టర్ తంబిదురై అన్నారు. వేలం ప్రక్రియలో రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రైవేటు రంగ కొనుగోలుదారులకు కట్టపెడుతున్నారని ఆరోపించారు. దీంతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ, తెలంగాణ విద్యుత్ సంస్థకు తాడిచెర్ల-1 బొగ్గు గనులను కేటాయించినట్లు తెలిపారు.

# ఇరాన్‌పై దాడి చేస్తే 'ప్రాంతీయ యుద్ధం'

ఈ నేపథ్యంలో ఇరాన్ సైతం హర్మూజ్ జలసంధిలో ఆది, సోమవారాల్లో వ్యూహాత్మక సైనిక కసరత్తు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ కసరత్తు సమయంలో తమ యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలకు ముప్పు కలిగించే ధోరణిని అనుసరిస్తే ఊరుకునేది లేదని అమెరికా సైనిక కేంద్ర కమాండ్ హెచ్చరించింది. మరోవైపు ఇరాన్‌లో జరిగిన దేశ వ్యాప్త నిరసన ప్రదర్శనలను ఒక కుట్రగా ఖమేనీ అభివర్ణించారు. యూరోపియన్ యూనియన్ సభ్యదేశాల సైన్యాలన్నిటినీ తాము ఉగ్రవాద సంస్థలుగా పరిగణిస్తామని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘేర్ ఖాలిబాఫ్ ప్రకటించారు. అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ దేశాల నాయకులు అశాంతికి ఆజ్యం పోస్తూ తమ దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నారని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ వ్యాఖ్యానించారు. అయితే, అగ్రరాజ్యంతో తాము యుద్ధం కోరుకోవడం లేదన్నారు.

## వెనెజువెలా చమురు కొనుగోలుకు భారత్ సిద్ధం!



మేము చైనాను స్వాగతిస్తున్నాం, మేము ఇప్పటికే వెనెజువెలాతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాం. ఇందులో భారత్ కూడా చేరనుంది. భారత్ ఇకపై ఇరాన్ నుంచి కాకుండా వెనెజువెలా నుంచి చమురును దిగుమతి చేసుకుంటుంది. దీనికి సంబంధించిన ఒప్పందంపై ఒక అవగాహనకు వచ్చాం" అని ట్రంప్ తెలిపారు. అయితే, దీనిపై భారత్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.


### క్యూబాతో చర్చలు జరుపుతాం..

క్యూబా నాయకులతో చర్చలు జరపనున్నామని, ఆ దేశంపై ఒత్తిడి పెంచుతున్నామని ట్రంప్ అన్నారు. క్యూబాకు చమురు సరఫరాను నిలిపివేయడం ద్వారా చర్చల వైపుగా దాన్ని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది మానవీయ సంక్షోభంగా మారాల్సిన అవసరం లేదని, క్యూబా కచ్చితంగా తమ వద్దకు వచ్చి ఒప్పందం కుదుర్చుకుంటుందని ట్రంప్ అన్నారు. అప్పుడు క్యూబా మళ్లీ స్వేచ్ఛ పొందుతుందన్నారు.

# హింసను ప్రేరేపించేందుకు వైఎస్సార్సీపీ కుట్ర - వారి ట్రాప్ లో పడొద్దు

మొదటి పేజీ తరువాయి

ఆ పార్టీ నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, వారు చేసిన పాపాల నుంచి పక్కదారి పట్టించాలని చూస్తున్నారని సీఎం దుయ్యబట్టారు. వైఎస్సార్సీపీ ట్రాప్ లో మనవాళ్లు పడకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. కార్యకర్తలు సంయమనం పాటించేలా సీనియర్ మంత్రులు, నేతలు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ ట్రాప్ లో పడొద్దన్న సీఎం: రాష్ట్రానికి ఎక్కువగా పెట్టుబడులను సాధించి అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా అని సీఎం చంద్రబాబు మంత్రులకు తేల్చి చెప్పారు. దీనిని చెడగొట్టేందుకు వైఎస్సార్సీపీ శతవిధాలా యత్నిస్తోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. తప్పు చేసిన ప్రతీ ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతామని సీఎం హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వైఎస్సార్సీపీ ట్రాప్ లో పడొద్దని హితవు పలికారు. పార్టీ సిద్ధాంతాలు ప్రజల మేలు కోసమే అనేది క్యాడర్ కు స్పష్టం చేయాలని నేతలను ఆదేశించారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులతో పుట్టిన వైఎస్సార్సీపీ ట్రాప్ లో పడితే వారికీ మనకూ తేడా ఉండదని సీఎం చంద్రబాబు వివరించారు. పార్టీ సీనియర్ నేతలు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మన పార్టీ సిద్ధాంతాలు ప్రజల మేలు



కోసమే అనేది క్యాడర్‌కు స్పష్టం చేయాలని ఆదేశించారు చేసిన పాపాలు కప్పిపుచ్చుకునేందుకే: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైఎస్సార్సీపీ అడ్డంగా దొరికిపోయిందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆ పార్టీని చీదరించుకుంటున్నారని తెలియజేశారు. చేసిన పాపాలను దారి మళ్లించాలనేది వైఎస్సార్సీపీ కుట్ర అని, పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా అని గుర్తు చేశారు. కానీ అది వైఎస్సార్సీపీ నేతలకు నచ్చడం లేదని, అందుకే అడ్డుకునేందుకు నానావిధాలా కుట్రలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అదే వైఎస్సార్సీపీ లక్ష్యం : రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకే వైఎస్సార్సీపీ నేతలంతా బూతు పురాణం ఎత్తుకున్నారని కార్యకర్తల టెలీకాన్ఫరెన్స్ లో నేతలు పల్లా శ్రీనివాసరావు, అచ్చెన్నాయుడులు స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైఎస్సార్సీపీ అడ్డంగా బుక్ అయిందని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రజలంతా వైఎస్సార్సీపీని చీదరించుకుంటున్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. లడ్డూ కల్తీ వ్యవహారాన్ని డైవర్ట్ చేయడానికే వైఎస్సార్సీపీ నేతలు బూతులు మాట్లాడుతున్నారన్న నేతలు, వైఎస్సార్సీపీ ట్రాప్ లో తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు పడకూడదని సూచించారు. గత 20 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని వివరించారు. అన్ని వర్గాల వారు కూటమి పాలనపై సంతోషంగా ఉన్నారని మంత్రులు తెలిపారు. పెట్టుబడుదారులు పెద్ద ఎత్తున రాష్ట్రానికి వస్తున్నారని వెల్లడించారు. వైఎస్సార్సీపీ నేతలు ఇక చేసేదేమీ లేక బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కార్యకర్తలను కావాలనే రెచ్చగొట్టి లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అలజడులు చూసి ఏపీకి ఎవరూ రాకుండా చేయాలన్నది వైఎస్సార్సీపీ నేతల కుట్రని నేతలు దుయ్యబట్టారు. వైఎస్సార్సీపీ కవ్వింపు చర్యల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పల్లా శ్రీనివాసరావు, అచ్చెన్నాయుడులు సూచించారు.

# తెలుగు రాష్ట్రాలకు 'గేమ్ ఛేంజర్' గా హైస్పీడ్ రైళ్లు- హైదరాబాద్ నుంచి 2గంటల్లోనే!

మొదటి పేజి తరువాయి


ఇందుకోసం బంగాల్‌లోని 40 కి.మీ వ్యూహాత్మక కారిడార్‌లో భూగర్భ రైల్వే ట్రాకులను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ కారిడార్ ఈశాన్య భారత దేశాన్ని దేశంలోని మిగిలిన ప్రాంతాలతో అనుసంధానిస్తుందని చెప్పారు."ఈశాన్య రాష్ట్రాలను భారత్ ప్రధాన భూభాగంతో కలిపే 40 కి.మీ వ్యూహాత్మక కారిడార్ కోసం ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయి. అక్కడ భూగర్భ రైల్వే ట్రాక్ లను నిర్మించడంతో పాటు, ప్రస్తుతం ఉన్న ట్రాక్ లను నాలుగు లైన్ల మార్గాలుగా మార్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. "

**- అశ్విని వైష్ణవ్ , రైల్వేశాఖ మంత్రి**

ఈ ప్రాజెక్టు వివరాలను ఈశాన్య సరిహద్దు రైల్వే (ఎన్ ఆర్ ఎఫ్ ) జనరల్ మేనేజర్ చేతన్ కుమార్ శ్రీవాస్తవ చెప్పారు. ఈ భూగర్భమార్గం బంగాల్ లోని తీన్ మైల్ హాట్ , రంగపాణి రైల్వే స్టేషన్ల మధ్య ఉంటుందని ఆయన తెలిపారు. భద్రత దృష్ట్యా ఈ భూగర్భ మార్గం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.

### హైస్పీడ్ రైలు కారిడార్స్ ఇవే

హైదరాబాద్ సహా ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ఆదివారం ప్రకటించారు. ప్రస్తుతం ముంబయి-అహ్మదాబాద్ మధ్య హైస్పీడ్ రైలు కారిడార్, అనేక రాష్ట్రాలు, జిల్లాలను కలిపే తూర్పు, పశ్చిమ రవాణా కారిడార్ల పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా బంగాల్ లోని డాంకునీ, గుజరాత్‌లోని సూరత్ మధ్య కొత్త రవాణా కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. అలాగే కొత్త ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు, రానున్న ఐదు సంవత్సరాల్లో 20 జాతీయ జలమార్గాల కార్యాచరణను ప్రతిపాదించారు. 'పర్యావరణపరంగా సుస్థిర ప్రయాణికుల వ్యవస్థను ప్రోత్సహించేందుకు ఏడు హైస్పీడ్ రైలుకారిడార్లను అభివృద్ధి చేయబోతున్నాం. అవి నగరాల మధ్య గ్రోత్ కనెక్టర్లుగా ఉంటాయి. వీటిద్వారా ప్రధాన ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాల మధ్య అనుసంధానం పెరుగుతుంది. ఇవి ప్రయాణ సమయాన్ని కుదిస్తాయని, రోడ్డు మార్గం, ఇప్పటికే ఉన్న రైలు నెట్‌వర్క్‌లో రద్దీని తగ్గిస్తాయి. ఇప్పుడు



టైర్-2, టైర్-3 నగరాలపై దృష్టి సారిస్తాం. టెంపుల్ టౌన్లపై కూడా. వాటికి ఆధునిక మౌలిక సదుపాయాలు, కనీస సదుపాయాల కల్పన, వాటి సామర్థ్యాన్ని పెంపునకు వచ్చే ఐదేళ్లలో రూ.5వేల కోట్లు వ్యయం చేసేందుకు ప్రతిపాదిస్తున్నాం. ఛాలెంజింగ్ పద్ధతిలో ఆ ప్రణాళికల అమలు కోసం సంస్కరణ, ఫలితాల ప్రాతిపదికన ఆర్థిక మెకనిజం ఏర్పాటు చేస్తున్నాం' అని నిర్మలా సీతారామన్ తెలిపారు.

# మళ్లీ ఉద్యమ రోజులు గుర్తుకొచ్చాయి

మొదటి పేజి తరువాయి

మేడారం జాతర ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. దావోస్ ఒప్పందాల ద్వారా వచ్చిన పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. "కేసీఆర్ నందినగర్ వస్తే అధికారికంగా 900 మంది పోలీసులను పెట్టారు. అనధికారికంగా ఆ సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుంది. హైదరాబాద్‌లో పట్టపగలే కాల్పులు, దోపిడీ ఘటనలు జరుగుతున్నాయి. యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ కొనసాగుతోంది. నల్లమలసాగర్ విషయంలో తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెడుతున్నారు. రాష్ట్రానికి నష్టం జరుగుతోంది. సింగరేణి బొగ్గు కుంభకోణం అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పష్టమైన సమాధానం లేదు. సీబీఐ, సిట్టింగ్ జడ్జి విచారణ కోరుతుంటే ఎందుకు వెనక్కిపోతున్నారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శాఖాపరమైన కమిటీ వేసి చేతులు దులిపేసుకున్నారు. ఈ వ్యవహారంలో సృజన్‌రెడ్డి కాల్ డేటా బయటకు తీస్తే అన్నీ బయటకు వస్తాయి. బీఆర్ఎస్ నిలదీస్తుంటే దృష్టి మరల్చేందుకు సిట్‌ల పేరిట విచారణలు చేస్తున్నారు. పైశాచిక ఆనందం కోసం కేసీఆర్‌ను



అంతసేపు కూర్చోబెట్టారు. ప్రజలకు ఒక్కొక్కటి అర్థమవుతున్నాయి.

ఒక్కొక్కటి తేలిపోతున్నాయి

ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదట్నుంచీ చెబుతున్న అబద్ధాలు ఒక్కొక్కటిగా తేలిపోతున్నాయి. మొదట వ్యాపార వేత్తలు, ఆ తర్వాత సినీ తారలు అన్నారు. ఇప్పుడు ఏమీ లేదని అంటున్నారు. ప్రభుత్వం ఇకనైనా పాలనపై దృష్టి పెట్టాలి. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన ఖర్మ మాకేముందని కేసీఆర్ స్పష్టంగా చెప్పారు. ఇవాళ రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో.. నాడు కేసీఆర్ ప్రభుత్వానికి కూడా అలాగే వచ్చింది. కాంగ్రెస్ పెద్దలు ఇకనైనా అసత్య ప్రచారం మానాలి. సజ్జనార్ జడ్జి కాదు.. ఆయన తీర్పు ఇస్తే ఎలా? అక్రమం అన్నది అభియోగం మాత్రమే.. తేల్చాల్సింది కోర్టులు. బీఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఎక్కడికక్కడే జరుగుతుంది. పెద్ద సమావేశాలు, రోడ్ షోలు ఉండవు. మంచి ఫలితాలు సాధిస్తాం.

60 సార్లు ఢిల్లీ వెళ్లిన సీఎం సాధించిందేంటి?

కేంద్ర బడ్జెట్‌లో పేదలు, రైతు కూలీలకు ఉపయోగపడే ఉపాధి హామీని కుదించారు. ఎరువుల రాయితీ, ఆహార రాయితీతో పాటు స్వచ్ఛ భారత్‌కు నిధులు కూడా తగ్గించారు. వ్యాక్సిన్లు, బల్క్ డ్రగ్స్, ఫార్మాకు హైదరాబాద్ కేంద్రం అయితే.. బయో ఫార్మా తయారీకి రూ.పది వేల కోట్లు కేటాయించి తెలంగాణకు రూ.10 కూడా కేటాయించలేదు. ఢిల్లీకి 60 సార్లు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి సాధించిందేంటి రెండు పార్టీల నుంచి 8 మంది చొప్పున ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి కలిగిన ప్రయోజనం సున్నా. తెలంగాణకు భాజపా ఇచ్చేది ఇదేనాహై స్పీడ్ రైల్ కారిడార్ కేటాయించామని గొప్పగా చెబుతున్నారు. తెలంగాణ భౌగోళికంగా దేశానికి మధ్యలో ఉంది.. కారిడార్ హైదరాబాద్ మీదుగా వెళ్లక తప్పదు. ప్రత్యేకంగా ఇచ్చినట్లు చెప్పడం హాస్యాస్పదం" అని కేటీఆర్ అన్నారు.

# చీరపై కాదు బడ్జెట్‌పై దృష్టి పెట్టండి- ఇదే ప్రశ్న వారిని అడిగేవారా

మొదటి పేజి తరువాయి

తనకు ఒత్తిడిగా మారుతున్నాయన్నారు. ఎందుకిలా ప్రశ్నలతో వేధిస్తున్నారు, ఒకవేళ బడ్జెట్ ప్రవేశపెట్టేది పురుష మంత్రులైతే వారిని కూడా ఇలాగే దుస్తుల గురించి అడిగేవారా అని ప్రశ్నించారు. తాను ధరించే చీరను కూడా బడ్జెట్‌లో ఒక అంశంలా మార్చేస్తున్నారని మండిపడ్డారు. బడ్జెట్‌లో ఉన్న అంశాలు ఏమిటనే విషయాలను తెలుసుకోవడంపై ప్రజలు దృష్టి పెట్టాలని, చీరలపై కాదని ఆర్థిక మంత్రి హితవుపలికారు. ఇలాంటి అనవసర విషయాల గురించి ఆలోచించడం వల్ల ముఖ్యమైన విషయాలపై పట్టు కోల్పోతామన్నారు. కాగా ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టిన సమయంలో నిర్మల కాంచీపురం చీరలో కన్పించారు. కొన్నినెలల్లో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఆమె కాంచీపురం చీరను ఎంచుకోవడంపై ఈసారి చర్చ జరిగింది.

### విద్యార్థులతో కేంద్ర మంత్రి సమావేశం

మరోవైపు 7-8 శాతం ఆర్థిక వృద్ధిని కొనసాగించడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత గల అంశమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇది పౌరులందరికీ ప్రయోజనం చేకూరుస్తుందని, ముఖ్యంగా మరిన్ని ఉద్యోగాలను సృష్టిస్తుందని అభిప్రాయపడ్డారు. 2026-27 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఆదివారం దేశంలోని వివిధ ప్రాంతాల కళాశాల విద్యార్థులతో జరిగిన సమావేశంలో నిర్మలా సీతారామన్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఆర్థిక వృద్ధి బాగుంటే దాని ఫలాలు పౌరులందరికీ అందుతాయని చెప్పారు.

"ఆర్థిక వృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఆ స్థాయిని కొనసాగించాలి. మనం 7-8 శాతం వృద్ధి స్థాయిలో ఉండాలి. కాబట్టి నేను చేసే ప్రతి పని ఆ వృద్ధిని కొనసాగించడానికి ఉద్దేశించిందే అయి ఉండాలి. ఆర్థిక వృద్ధి ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఎక్కువ మందిని శ్రామిక శక్తిలోకి తీసుకువచ్చి ఉత్పాదకతను పెంచుతుంది. పాక్షిక నైపుణ్యం గల పాత్రల్లో మహిళల సంఖ్య పెరగడంలో ఇది ప్రతిబింబిస్తోంది."

**నిర్మలా సీతారామన్ , కేంద్ర ఆర్థిక మంత్రి**

అయితే, బోర్డు రూమ్‌ల్లో మహిళల ప్రాతినిధ్యం పరిమితంగా ఉండటంపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆందోళన వ్యక్తం చేశారు. నిర్ణయాలు తీసుకోవడంలో ప్రభావితం చేయడానికి, ఇతరులకు ఆదర్శంగా నిలవడానికి ఎక్కువ మంది మహిళలు నాయకత్వ స్థానాలకు ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రగతి సాధించినప్పటికీ, ఇంకా చాలా చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. గత బడ్జెట్ నుంచి ఆరెంజ్ ఎకానమీ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగం) కోసం ప్రభుత్వం నిరంతరం విధానాలు, నిధులు, మద్దతును అందించిందని మంత్రి విద్యార్థులకు తెలియజేశారు. బడ్జెట్ తయారీ అక్టోబర్ చివరిలో లేదా నవంబర్‌లో పరిశ్రమ వర్గాలు, వ్యాపారాలు, ఆర్థికవేత్తలు, కార్మిక సంఘాలతో సంప్రదింపులు చేసి ప్రజాభిప్రాయాలు స్వీకరిస్తామని విద్యార్థులకు వివరించారు. వారి సూచనలను షార్ట్‌లిస్ట్ చేసి సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలతో చర్చించి వాటి అమలు కోసం ప్రయత్నిస్తామని



తెలిపారు. ఇలా అనేక సమీక్షలు, ముసాయిదా దశల తర్వాత, బడ్జెట్ ప్రసంగం ఖరారు అవుతుందని చెప్పారు. కాగా, బడ్జెట్ విధి విధానాలు, రూపకల్పన విషయాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కొంతమంది విద్యార్థులకు అవకాశం కల్పించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల నుంచి 30 మంది విద్యార్థులు ఎంపికైనట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం ఎంపిక చేసిన విద్యార్థులు లోక్‌సభ గ్యాలరీ నుంచి ప్రత్యక్షంగా బడ్జెట్ ప్రసంగాన్ని వినే అవకాశాన్ని కల్పించారు. వీరు కర్తవ్య భవన్‌లోని ఆర్థిక మంత్రిత్వ శాఖను కూడా సందర్శించారు. ఈ క్రమంలోనే ఆర్థిక శాఖ పనితీరు, విధాన రూపకల్పన ప్రక్రియలు, అత్యున్నత స్థాయిల్లో ఆర్థిక నిర్ణయాలు ఎలా రూపొందిస్తారు? అమలు చేస్తారు? అనే విషయాలను ఆ విద్యార్థులు తెలుసుకోనున్నారు. పరిపాలనకు సంబంధమైన విషయాలపై విద్యార్థుల్లో అవగాహన తీసుకురావడానికి కేంద్రం ఈ వినూత్న నిర్ణయం తీసుకుంటున్నట్లు చెబుతున్నారు.

# కేసీఆర్ ను సిట్ విచారణ కోసం పిలిస్తే తప్పేంటి

నా ఫోన్, నా భర్త ఫోన్లు ట్యాప్ చేశారని అనుమానాలున్నాయి - సిట్ అధికారులు పిలిస్తే వెళ్లి విచారణకు సహకరిస్తా - సిట్ విచారణను తప్పుపడుతూ కేటీఆర్ మాట్లాడటం సరైంది కాదన్న కవిత

ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి రెండేళ్లవుతున్నా సిట్ విచారణ ముగింపునకు రావడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విచారణ త్వరగా పూర్తిచేసి దోషులకు శిక్ష పడేలా చూడాలని ఆమె కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవిత పాల్గొని మాట్లాడారు. సిట్ విచారణలో ఏం జరిగిందో మాజీ సీఎం కేసీఆర్ చెబుతారని భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

మా ఫోన్లు ట్యాప్ చేశారనే అనుమానాలున్నాయి : సిట్ విచారణను తప్పుపడుతూ బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడటం సరికాదని, చట్టాలను అందరూ గౌరవించాలని కవిత అన్నారు. చట్టానికి సహకరించాలని పేర్కొన్నారు. గుంట నక్కలతో



కలిసి కాంగ్రెస్ పార్టీ డ్రామాలాడుతోందన్న కవిత తన భర్త ఫోన్లు ట్యాప్ చేశారనే అనుమానాలున్నాయని చెప్పారు. సిట్ అధికారులు విచారణకు పిలిస్తే వెళ్లి సహకరిస్తానని స్పష్టం చేశారు.

సిట్ విచారణలో ఏం జరిగిందో కేసీఆరే చెబుతారని భావిస్తున్నా

ఇక్కడి ప్రజలను నిర్మల విస్మరించారు : కేంద్రంలోని బీజేపీ తీరు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు ఐఐఎం, నవోదయాలు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఇంకా ఇవ్వట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మెట్రో రైల్ ఫేజ్-2 గురించి బడ్జెట్‌లో ప్రస్తావనే లేదన్న ఆమె తెలుగింటి ఆడబిడ్డ నిర్మల తెలంగాణ ప్రజలను విస్మరించారని మండిపడ్డారు. ఏపీ పునర్విభజన చట్టంలోని అంశాలు 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని దుయ్యబట్టారు. కొత్త ఎయిర్‌పోర్టులు, ఆర్ఆర్ఆర్‌ను పెండింగ్‌లోనే పెట్టారని ఆక్షేపించారు. రాష్ట్రప్రభుత్వం 47 అంశాల గురించి అడిగితే ఏమీ ఇవ్వలేదని, ఇద్దరు కేంద్రమంత్రులు ఉండి రాష్ట్రానికి ఏమీ తేలేకపోవడం బాధాకరమన్నారు. దేశంలో విద్య, వైద్యానికి 1, 2 శాతమే నిధులు కేటాయించటం దారుణమని కవిత ఆక్షేపించారు.

# పండుగ వాతావరణం లో ప్రమాణ స్వీకారం



ప్రజాస్వామ్యం ,విజయనగరం తాడేపల్లిగూడెం లోని కమ్మవారి కళ్యాణమండపం నందు ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ప్రతీక గా నిలిచిన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులుగా కోనా శ్రీనివాసరావు ప్రమాణ స్వీకార మహోత్సవం అంగరంగ వైభవంగా పండుగ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విజయనగరం జిల్లా నుంచి మహిళా విభాగం అధ్యక్షురాలుగా పలుకూరి ప్రభావతి ప్రమాణ స్వీకారం చేశారు


## జన కళ్యాణ సమాఖ్య ఆధ్వర్యంలో వేప పిండి పంపిణీ ఏ ఓ తిరుపతిరావు





ప్రజాస్వామ్యం /పాచిపెంట/ మన్యం జిల్లా.. ఫిబ్రవరి2:గిరిజన గ్రామాలలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జన కళ్యాణ సమాఖ్య (జీఖూ) సంస్థ ఆధ్వర్యంలో 30 ఎకరాలకు సుమారు 25 మంది రైతులకు వేపపిండి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారి కె తిరుపతిరావు మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో మొక్కజొన్న పంట వలన నష్టమే తప్ప లాభం ఉండదని కాబట్టి గిరిజన రైతులను మొక్కజొన్న పంటకు బదులుగా చిరుధాన్యాల సాగును పెంచాలని చిరుధాన్యాలకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రసాయన వ్యవసాయాన్ని చేపట్టడం వలనే తేనెటీగలు నశించి ప్రస్తుతం గిరిజన గ్రామాలలో తేనె దొరకడం లేదని తేనెటీగలు అంతరించిపోతే ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోతుందని తెలిపారు. జన కళ్యాణ సమాఖ్య ఫీల్డ్ కోఆర్డినేటర్ ఈదుబిల్లి మహేష్ మాట్లాడుతూ జే కే ఎస్ సంస్థ ఆధ్వర్యంలో రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టనున్నామని ప్రకృతి వ్యవసాయ విస్తరణకు ప్రోత్సాహాన్ని అందిస్తామని నీటి వనరుల సద్వినియోగం ద్వారా స్థిరమైన ఆయకట్ట ఉండేటట్లుగా చిన్న చిన్న చెక్ డ్యాములను మరమ్మతులు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామంలో 14 మంది రైతులకు పెరటి కూరగాయల సాగుకు విత్తనాలు పంపిణీ చేశామని తెలిపారు. రైతులకు చిరుధాన్యాల అభివృద్ధికి మరిన్ని సమావేశాలు నిర్వహించాలని సర్పంచ్ తోడు పిల్లి సుందర్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ విజయ్ మరియు రైతులు పాల్గొన్నారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతులు అమలు చేయాలి వ్యవసాయ కార్మిక సంఘాలు




ప్రజాస్వామ్యం/ సాలూరు/ మన్యం జిల్లా.. ఫిబ్రవరి2:జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పాతి పద్ధతుల్లో అమలు చేయాలని కరాచవలస, కూర్మరాజుపేట, నార్లవలస , జిల్లేడు వలస పంచాయతీ సచివాలయాల వద్ద నిరసన తెలియజేసి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతులు నడిపి నిధులు పెంచాలని కూలి పెంచాలని పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 6వ తేదీన ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలు ఉపాధి కూలీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు చలంబార్కి సింహాచలశీ, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కోనేటి చినబాబు, సన్యాసి ,ఉపాధి కూలీలు రామజన్ని సింహాచలం, కంట చినపాలయ్య, రెడ్డి పరమేష్, కోనవలసి గౌరీ, బొడ్డు దొర, నరసింహులు, సోశీబార్కి ఈశ్వరరావు పాల్గొన్నారు.

## మధ్యలో ఆగిన స్కూలు బిల్డింగ్ పిల్లలతో కలిసి తల్లిదండ్రులు నిరసన కార్యక్రమం



ప్రజాస్వామ్యం /పాచిపెంట/ మన్యం జిల్లా.. ఫిబ్రవరి2:గొట్టురు గ్రామంలో స్కూల్ బిల్డింగు స్లాప్ నిర్మాణం మధ్యలో ఆపేసారని పిల్లలు మరియు పిల్లల తల్లిదండ్రులతో కలిసి నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. గొట్టురూ వైస్ సర్పంచ్ సేబి రామయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు వైస్ సర్పంచ్ రామయ్య పత్రికా విలేకరులతో మాట్లాడుతూ 45 మంది స్కూలు పిల్లలు చదువుకుంటున్న ఈ స్కూలుకి బిల్డింగ్ నిర్మాణం చేపట్టారు. కానీ మధ్యలో వదిలి వెళ్ళిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం వలన స్కూల్లో రేకులు ఏర్పాటు చేసి రేకుల కింద చదువుకోవడమనేది జరుగుతోందని అన్నారు. ప్రమాదంలో రేకులు పడితే పిల్లలు ప్రాణాపాయం గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బిల్డింగ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ యొక్క సమస్యను అధికారులు వెంటనే స్పందించి మా సమస్యను తీర్చాలని పిల్లల తల్లిదండ్రులు కోరారు.

## పంచాయతీ ప్రత్యేక అధికారులు మరియు పంచాయతీ సెక్రెటరీ లకు దిశ నిర్దేశం చేసిన మండల ప్రత్యేక అధికారి రాధాకృష్ణ




ప్రజాస్వామ్యం/పాచిపెంట/ మన్యం జిల్లా.. ఫిబ్రవరి 2: ఈరోజు పాచిపెంట మండలం ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ల మరియు పంచాయతీ సెక్రెటరీ పలు అంశాలపై దిశ నిర్దేశం చేసిన మండల ప్రత్యేక అధికారి రాధాకృష్ణ . ప్రతి అధికారి ముస్తాబు కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలని, మరియు త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని, పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి గ్రామాల్లో మురికి నీరు నిల్వలో ఉండకూడదని ఆదేశించారు. ప్రతి పంచాయతీలో పంచాయతీ ప్రత్యేక అధికారి ప్రతిరోజు మొనిటింగ్ చేయాలని తెలిపారు.విధి నిర్వహణలో ఏ ఒక్క సెక్రటరీ అశ్రద్ధ వహించిన వారిపై చర్యలకు ఉపేక్షించబమని తెలిపారు. ఈ యొక్క సమావేశంలో ఎంపీడీవో బి వి జె పాత్రు, ఈఓ పి డి మల్లేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత

**పీజీఆర్ఎస్ కు 143 వినతులు**

**జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి**



ప్రజాస్వామ్యం/ పార్వతీపురం, మన్యం జిల్లా..ఫిబ్రవరి 02 : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత భాగస్వామ్యమై అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా 143 దరఖాస్తులు అందగా రెవిన్యూ దరఖాస్తులు 91, సాధారణ దరఖాస్తులు 52 ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేవలం అర్జీల సమస్యలను పరిష్కరించడమే ముఖ్యం కాదని, ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని, గడువు ముగియక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, మున్సిపల్, పోలీసు మరియు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఫిర్యాదులను తిరస్కరించాల్సి వస్తే, దానికి సరైన కారణాలను తెలియజేస్తూ ఫిర్యాదుదారునికి లిఖితపూర్వక సమాచారం ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ రహిత జిల్లాగా మారుద్దాం

**బహిరంగ మలవిసర్జనపై అవగాహన కల్పించాలి**

**బాల్య వివాహాల నిర్మూలనకు మహిళా పోలీసులు కృషి చేయాలి**

**జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి**





ప్రజాస్వామ్యం /పార్వతీపురం, మన్యం జిల్లా..ఫిబ్రవరి 02 : జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా మహిళా సంరక్షణ కార్యదర్శులు ( మహిళా పోలీసులు ) క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని సచివాలయాల మహిళా పోలీసులకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులలో ఆయన, జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి గారితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ?గ్రామ/వార్డు పరిధిలోని మహిళలు, చిన్నారుల భద్రతను మహిళా పోలీసులు పర్యవేక్షించాలన్నారు. ?బాల్య వివాహాలను అరికట్టాలని, ?మహిళలపై జరిగే వేధింపులు, గృహహింస వంటి కేసుల్లో బాధితులకు అండగా ఉండి, వారికి చట్టపరమైన అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి విక్రయాలు, జూదం, అక్రమ మద్యం గురించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో పాటు ?అపరిచిత వ్యక్తులు లేదా అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని అన్నారు. ?సైబర్ నేరాల పట్ల మహిళలకు అవగాహన కల్పించాలని, ?అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్యం, పౌష్టికాహారంపై నిఘా పెట్టాలని పేర్కొన్నారు. బహిరంగ మలవిసర్జన వలన సమాజంలో అగౌరవంతో పాటు ఆరోగ్యానికి సంబంధించిన వివిధ వ్యాధులు వ్యాపిస్తాయని, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని అన్నారు. ప్రతి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకొని వాడుకలోకి తీసుకురావాలని, స్వచ్ఛ భారత్' వంటి పథకాలను ఉపయోగించుకుని గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చాలని ఆదేశించారు. అలాగే ?ప్లాస్టిక్ అనేది భూమికి పెను శాపంగా మారిందని, ఇది కొన్ని వందల ఏళ్ల వరకు భూమిలో కరిగిపోదన్నారు. ప్లాస్టిక్ వల్ల డ్రైనేజీలు పూడికపోవడం, జంతువులు ప్రాణాలు కోల్పోవడం, మైక్రో-ప్లాస్టిక్స్ ద్వారా మన ఆహారంలోకి విషతుల్యాలు చేరుతాయని తెలిపారు. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ ను నిషేధించి, గుడ్డ సంచిని వెంట తీసుకు వెళ్లేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఒకరికి సహాయం చేయడం మానవత్వానికి గొప్ప నిదర్శనమని, అదే మన్యం హెల్పింగ్ హేండ్స్ అని కలెక్టర్ గుర్తుచేశారు. మానవసేవతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి హెల్పింగ్ హేండ్స్ లో చేరవచ్చని పిలుపునిచ్చారు. రోగులు ఆసుపత్రికి వచ్చిన నాటి నుంచి ఆరోగ్యంగా తిరిగి ఇంటికి వెళ్లేవరకు పూర్తి బాధ్యతను మన్యం హెల్పింగ్ హ్యాండ్స్ తీసుకుంటుందని అన్నారు. సమాజానికి శాపంగా మారిన బాల్య వివాహాల వల్ల బాలికల భవిష్యత్తు దెబ్బతినడమే కాకుండా, వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయాల పరిధిలో ఎక్కడైనా చిన్న వయసులో వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే మహిళా పోలీసులు వెంటనే స్పందించి, వాటిని అడ్డుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో తల్లిదండ్రులకు బాల్య వివాహాల వల్ల కలిగే చట్టపరమైన ఇబ్బందులు మరియు అనర్థాలపై నిరంతరం అవగాహన కల్పించాలని కోరారు.ప్రతి ఒక్కరికి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఫ్యామిలీ, గ్రామ ముస్తాబు తప్పనిసరి అని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇకపై ప్రతి కుటుంబం, కార్యాలయం, అంగన్వాడీ కేంద్రం, పాఠశాలలు ముస్తాబు కావాలని, ఆ దిశగా పర్యవేక్షణ చేయాలని అన్నారు పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మురుగునీరు నిలిచి ఉండరాదని చెప్పారు. ప్రభుత్వ సంస్థలు, నివాస ప్రాంతాలు, విద్యాసంస్థలను, అంగన్వాడీలు పరిశుభ్రంగా మార్చడం ద్వారా ఒక ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని సృష్టించడంతో పాటు ప్రజల్లో పారిశుధ్యం పట్ల చైతన్యం తీసుకురావడం దీని లక్ష్యం అన్నారు. ఖాళీ ప్రదేశాల్లో పచ్చదనం కోసం మొక్కలు నాటడం, అంటువ్యాధులు ప్రబలకుండా వీధుల్లో బ్లీచింగ్ చల్లడం, ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్తను వేరు చేయడం, టైర్లు, కొబ్బరి చిప్పలు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసి దోమల నివారించవచ్చన్నారు. ఇంటి పరిసరాలను ముగ్గులతో, మొక్కలతో అందంగా తీర్చిదిద్దుకోవడం,?గదులను శుభ్రం చేయడం, గోడలపై విద్యా సంబంధిత చిత్రాలు వేయడం, తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయడం. రన్నింగ్ వాటర్ సౌకర్యం ఉండేలా చూస్తూ, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని అన్నారు. చిన్న పిల్లలు ఉండే చోటు కాబట్టి అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలను ఆకట్టుకునేలా గోడలపై అక్షరాలు, పండ్లు, జంతువుల చిత్రాలను రంగులతో దిద్దడం. అంగన్‌వాడీ ప్రాంగణంలో పెరటి తోటల పెంపకం చేపట్టేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమం కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలన్నారు. మన పరిసరాలు బాగుంటేనే మన ఆరోగ్యం బాగుంటుందని, అంటువ్యాధుల రహిత సమాజం కోసం ఈ ముస్తాబు నిరంతర ప్రక్రియగా మారాలన్నారు. జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థలో మహిళా పోలీసులు కీలకమని, బాలికల సంరక్షణ విషయంలో రాజీ పడకూడదని అన్నారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖతో సమన్వయం చేసుకుంటూ, బాల్య వివాహ రహిత జిల్లాగా పార్వతీపురాన్ని తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.ఈ శిక్షణా కార్యక్రమంలో ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ అధికారిణి టి. కనకదుర్గ, ఎ ఎస్ పి వి.మనీషా రెడ్డి, జిల్లాలోని వివిధ సచివాలయాలకు చెందిన మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఇతర జిల్లా స్థాయి అధికారులు ఉన్నారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

**పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలి**

**రెవెన్యూ అధికారులకు దిశా నిర్దేశం చేసిన జేసీ**



ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మన్యం జిల్లా..ఫిబ్రవరి 02 : ప్రజల నుంచి అందుతున్న రెవెన్యూ వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించి, వారికి మెరుగైన సేవలు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి రెవిన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఛాంబరులో సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లు, డిఎంసీఎస్ ఇతర రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని రెవెన్యూ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ క్లినిక్ ద్వారా వచ్చిన దరఖాస్తులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల నివేదికలను జేసీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఏ ఒక్క దరఖాస్తు కూడా అకారణంగా పెండింగ్‌లో ఉండకూడదని, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి వెనువెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మ్యుటేషన్లు, భూమి సర్వేలు, ఇతర రెవెన్యూ సంబంధిత సర్వీసుల పురోగతిపై తహశీల్దార్లకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా గడువులోగా దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కరించాలని సూచించారు. ఈ విషయంలో సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లు సమన్వయంతో పనిచేస్తూ భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ భూముల రక్షణపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాచిపెంట జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సస్పెండ్ చేసిన మన్యం జిల్లా డీఈవో

ప్రజాస్వామ్యం/ పార్వతీపురం, మన్యం జిల్లా..

పార్వతీపురం, మన్యం జిల్లా విద్యాశాఖాధికారి గారు తేదీ 31.01.2026 న నిర్వహించిన సందర్శన సందర్భంగా, జెడ్‌పీహెచ్ఎస్ పాచిపెంట పాఠశాలలో, ప్రధానోపాధ్యాయుడు (గ్రేడ్--××)గా పనిచేస్తున్న శ్రీ బి . ఈశ్వర రావు వారి ఆధీనంలో పాఠశాలలో తీవ్రమైన అవకతవకలు మరియు విధుల పట్ల నిర్లక్ష్యం చోటు చేసుకున్నట్లు గమనించబడినది.తనిఖీ సమయంలో క్రింది అంశాలు గుర్తించబడినవి: రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న ప్రతిష్టాత్మక ముస్తాబు కార్యక్రమం పాఠశాలలో సక్రమంగా అమలుకాకపోవడం గమనించబడినది.పాఠశాల ముస్తాబు, తరగతి గదుల శుభ్రత మరియు ఆకర్షణీయతపై ఉన్నతాధికారులు పదేపదే సూచనలు ఇచ్చినప్పటికీ, వాటిని పాటించనట్లుగా కన్పించినది.పాఠశాల తరగతి గదుల్లో ఉపయోగించదగిన పాత ఫర్నిచర్‌ను బయటకు వేసి నిరుపయోగంగా చేయడం వలన ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం మరియు నష్టం కలిగినది.మరు గుదొడ్లు సరిగా నిర్వహించకపోవడం వలన దుర్గంధం వెలువడి, విద్యార్థుల ఆరోగ్యానికి హానికరమైన పరిస్థితి ఏర్పడినది. ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్వహణకు అవసరమైన సామగ్రిని సరఫరా చేసినప్పటికీ, వాటిని వినియోగించకుండా నిర్లక్ష్యంగా వదిలివేయబడినది. పాఠశాల ఆవరణ మొత్తం ఎండిన ఆకులు, చెత్త కాగితాలతో నిండిపోయి పరిశుభ్రత పూర్తిగా లోపించినది.2023--24 సంవత్సరంలో సరఫరా చేసిన ఐఎఫ్‌బీలు ప్రభుత్వం ఉపయోగించకుండా నిర్లక్ష్యంగా ఉంచబడినవి.సరఫరా చేసిన గ్రీన్ చాక్ బోర్డులను తరగతి గదుల్లో వినియోగించకుండా, వరండాలో మెట్ల కింద ధూళిలో పడవేయబడినది.

ఉపాధ్యాయుల హాజరును ఆన్‌లైన్‌లో పర్యవేక్షించడంలో కూడా పూర్తిగా విఫలమైనట్లు తేలినది.అందువల్ల, శ్రీ బి . ఈశ్వర రావు, ప్రధానోపాధ్యాయుడు (గ్రేడ్--××) వారి ప్రవర్తన విధుల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని మరియు పాఠశాల పరిపాలనలో పూర్తిగా వైఫల్యాన్ని సూచిస్తున్నది.

అందువల్ల, ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నియమావళి, 1991 లోని నిబంధన 8(1) మరియు 8(2) ప్రకారం లభించిన అధికారాలను వినియోగించి, శ్రీ కె. ఈశ్వర రావు, ప్రధానోపాధ్యాయుడు (గ్రేడ్--××), జెడ్‌పీహెచ్ఎస్ పాచిపెంట వారిని క్రమశిక్షణా విచారణ పూర్తయ్యే వరకు తక్షణ ప్రభావంతో విధుల నుండి సస్పెండ్ చేయడమైనది.జిల్లా విద్యాశాఖాధికారి పార్వతీపురం మన్యం జిల్లా

# రాష్ట్రంలో అరాచక పాలన

**మాజీ - ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య**

**- అంబటి రాంబాబు డాడీ పై దాడి కారణం. ----గలమెత్తిన గొంతును నొక్కేస్తున్నారు.**




ప్రజాస్వామ్యం / గజపతినగరం:

రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతుందని మాజీ శాసనసభ్యులు, వైకాపా నేత బొత్స అప్పల నరసయ్య విమర్శించారు. ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రశ్నించే గొంతుకని ఈ ప్రభుత్వం నొక్కేస్తుందని అన్నారు. అంబటి రాంబాబు పై దాడి అమానుష చర్యని పేర్కొన్నారు. అంబటి ఇంటి పై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ,రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిబిఐ ఎంక్వయిరీలో తిరుపతి లడ్డూలో కల్తీ జరగలేదని తేలడంతో టిడిపి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఆ అక్కసుతోనే వైకాపా నాయకులు పై దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు .ప్రజల్లో రోజురోజుకు కూటమి పాలన పట్ల వ్యతిరేకత ఎక్కువవుతుందన్నారు. ఇది తెలిసి డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగా అరాచకాలు, అలజడులు రాష్ట్రంలో సృష్టిస్తున్నారని అన్నారు. అధికారశీ కోసం చంద్రబాబు నాయుడు ఏమైనా చేస్తాడని, ఎంతకైనా తెగిస్తాడని విమర్శించారు. ఈ దాడులపై సమగ్ర కార్యాచరణ పై తమ పార్టీ ముందుకు వెళుతుందని అన్నారు. గవర్నర్ ను కలిసి రాష్ట్ర పరిస్థితలపై నివేదిక ఇస్తామని తెలిపారు. అలాగే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాల్సిన పరిస్థితిలను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి గార తౌడు, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు , సర్పంచ్ కె. పైడుపునాయుడు, ఉజ్జూరు శ్రీను, కర్రీ లక్ష్మణ, పాల్గొన్నారు.

www.prajaswamyamtelugudaily.com
స్థాపితం : 2008
ప్రజాస్వామ్యం
తెలుగు దినపత్రిక
PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)
మంగళవారం, ఫిబ్రవరి 03 ,2026

## క్రాష్ ప్రోగ్రాం ప్రారంభించిన ఎంపీపీ - "బెల్లాన జ్ఞాన దీపిక"



ప్రజాస్వామ్యం / గజపతినగరం:
ఈనెల రెండో తేదీ నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించనున్న సమ్మర్ క్రాష్ ప్రోగ్రాం ను ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ప్రారంభించారు. రానున్న వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చేసేందుకు ఈ క్రాస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామాల్లో మరమ్మత్తులు కు గురైన చేతిపంపులను బాగు చేసుకుని నీటి సమస్య తలెత్తకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, జడ్పిటిసి గార తౌడు, ఎంపీడీవో బి. కళ్యాణి, సూపరింటెండెంట్ పుష్పలత, డిప్యూటీ ఎంపీడీవో డోల శంకర్రావు, ఆర్డబ్ల్యూఎస్ ఏ.ఈ మజ్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




భువనగిరి ప్రజాస్వామ్యం ఫిబ్రవరి 02: యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. పదవ తరగతి వరకు ఇక్కడ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ వృత్తులు,హోదాల్లో స్థిరపడ్డారు. వీరంతా ఈ కార్యక్రమానికి హాజరై తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు. అప్పట్లో తమకు గురువులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. చదువుకునే రోజుల్లో అలనాటి జ్ఞాపకాలు, అనుభూతులను ఒకరికొకరు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు ప్రస్తుత విద్యార్థుల క్రీడా అవసరాల కోసం రూ.10,000 నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురాం రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమానికి పూర్వ ఉపాధ్యాయులు కొంతం అంజిరెడ్డి, పైళ్ళ కృష్ణారెడ్డి, బంద్రు రాజమల్లయ్య, అనంతుల బుచ్చిరెడ్డి, భాస్కరరావు, మధురవాణి హాజరయ్యారు. కార్యక్రమంలో దాదాపు 70 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## కలిగొట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో మందులు పంపిణీ



ప్రజాస్వామ్యం భీమునిపట్నం, స్థానిక చిన్న బజార్ డచ్ వీధిలో కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 90 వ ఉచిత హోమియో వైద్య శిభిరం నిర్వహించినట్లు ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి తెలియచేసారు. ఈ వైద్యశిభిరంలో 90మందికి పరీక్షలు నిర్వహించి ఉచితముగా హోమియో మందులు పంపిణీ చేసారు. తమ సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ వైద్య శిభిరం ఏర్పాటు చేసినట్లు శ్రీరాం తెలియచేసారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యులు టి.జగన్నాధ రావు, టి.జె.మోహన్, ఫౌండేషన్ ప్రతినిధులు కే ఎస్ ఎన్ మూర్తి, కె.చంద్ర శేఖర్, కే.వి. భానోజీరావు, కే. శ్రీనివాసరావు, కే. చంద్ర శేఖర్ మరియు ఫౌండేషన్ సభ్యులు, రాంబాబు, శ్రీనివాసరావు, ఎం.శంకర్, బాల మాస్టర్, గంధ రాము, కిషోర్, లక్ష్మణరావు, దివ్య, భారతి, పాల్గొన్నారు.

## మాఘ పౌర్ణమి వేళ కనీస ఏర్పాట్లు కరువు



ప్రజాస్వామ్యం భీమునిపట్నం,మాఘ పౌర్ణమి అంటే పవిత్ర స్నానాలకు ప్రసిద్ధి, సాక్షాత్తు దేవతలే భువిపైకి వచ్చి నదుల్లో స్నామాచరిస్తారని పురాణ గాథ. ఒకవేళ నదీ స్నానం చేయలేని వారు సముద్రంలో స్నామాచరిస్తారు అదీ కుదరకపోతే ఇంటి దగ్గరే స్నానం ఆచరిస్తూ 'గంగ చ యమునే చైవ' అనే శ్లోకాన్ని పఠిస్తారు. ఈ మాఘ పౌర్ణమి తిథి వందేళ్లకు ఒకసారి వస్తుంది. అటువంటి రోజు భీమిలి సముద్ర తీరంలో వందలాది భక్తులు స్నామాచరిస్తారు. ఇటువంటి సమయంలో అధికారులు కనీస ఏర్పాట్లు చేయకపోవడంపై స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. మహిళలు వస్త్రాలు మార్చుకోవడానికి కూడా ఇక్కడ ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల భీమిలిలో నిర్వహించిన విశాఖ ఉత్సవాల ఏర్పాట్ల విషయంలో స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు అధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేశారు. వందలాదిమంది భక్తులు వచ్చే సమయంలో ముందస్తు ఏర్పాట్లు చేసి ఉంటే బాగుండేది అని స్థానిక ప్రజలు అంటున్నారు.

## దివిస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




ప్రజాస్వామ్యం భీమునిపట్నం,చిప్పాడ దివిస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో మండలంలోని టి.నగరపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బాలల ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ శోభారాణి పాఠశాలలకు చెందిన 40 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని పరిశుభ్రమైన వాతావరణం లో ఉండాలని సూచించారు. ఈ శిబిరంలో ప్రతి విద్యార్థిని పరీక్షించి వారికి అవసరమైన మందులను మరియు ప్రధమ చికిత్స వస్తు సామాగ్రి దివిస్ వారిచే ఉచితంగా అందజేయడం జరిగింది. సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి, ఎంపీటీసీ పల్ల నీలిమ, సిఎస్ఆర్ ఇన్చార్జి ఏ. శ్రీనివాస్, శేఖర్ బాబు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఆర్ట్ అండ్ కల్చరల్ పోటీలో భవిత విద్యార్థుల సత్తా



ప్రజాస్వామ్యం భీమునిపట్నం, ప్రతినిధి: పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా సహిత విద్యా విభాగం ఆధ్వర్యములో సోమవారం చిన గదిలి మండలం తోటగరువు శ్రీ ఎర్ని దుర్గమాంభ కళావేదిక లో జిల్లాస్థాయి ఆర్ట్ అండ్ కల్చరల్ పోటీలలో భీమిలి భవిత కేంద్రం విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీలలో భీమిలి కేంద్రం లోని జి. దినేష్, బి. తనయ్, ఎస్. రంజిత్ కుమార్, ఎస్ కే సుభాని, సి హెచ్. చైత్రిక్, సి హెచ్.జగదీశ్, బి. చిన్ని మొదలగువారు "గణపతి" గ్రూప్ డాన్స్ లో ప్రధమ స్థానం సాధించారు. ఫాన్సీ డ్రెస్ కాంపిటిషన్ లో "కృష్ణుడు " పాత్రలో జి. దినేష్ ప్రధమ స్థానము సాధించాడు. ఈ కార్యక్రమంలో డి ఈ ఓ ప్రేమ్ కుమార్, ఏపీసీ, ఐ ఈ కోర్డినేటర్, ఎం ఈ ఓ లు, జిల్లాలోని స్పెషల్ ఎడ్యుకేటర్స్, ఐ ఈ ఆర్ పి లు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దత్తత కుటుంబానికి నిత్యావసరాలు అందజేసిన ఫౌండేషన్

**- కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం.**

**ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు ----సాయికుమార్ , రేవంత్**



ప్రజాస్వామ్యం - గజపతినగరం/ విజయనగరం:
సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా విజయనగరం లోని రాజీవ్ నగర్ కాలనీ కి చెందిన ఒక కుటుంబాన్ని సాయి స్ఫూర్తి ఫౌండేషన్ దత్తత తీసుకున్న విషయం పాఠకులకు విధితమే . పి-4 దత్తత కార్యక్రమం లో భాగంగా ఆ కుటుంబానికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని వార్షికోత్సవం రోజు ఫౌండేషన్ హామీ ఇచ్చిన విషయాన్ని సాయికుమార్ రేవంత్ తెలియజేశారు.అందులో భాగంగా ఫిబ్రవరి నెల కు సంబంధించి వారికి సరిపడా బియ్యంతో పాటు, నిత్యావసరాలను వారి ఇంటి వద్దకే తీసుకెళ్లి ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాయి కుమార్,రేవంత్ లు అందజేశారు.ఫౌండేషన్ సభ్యుడు వెంకటేష్ తన కుమార్తె జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం చేసినట్లు సాయి కుమార్,రేవంత్ తెలిపారు.

## వైద్య సేవలకు పెద్దపీట

**- గజపతినగరం ఏరియా ఆసుపత్రి సమగ్ర అభివృద్ధి**


**- ల్యాబ్ టెస్టులు, ఓపీ సేవల్లో చారిత్రాత్మక వృద్ధి**

**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామాత్యులు ---సత్యకుమార్ యాదవ్**

**- గజపతినగరం ఏరియా ఆసుపత్రిని 100 పడకల సదుపాయాలతో ఆధునికికరించడం చారిత్రాత్మక ముందడు.**

**రాష్ట్ర ఎంఎస్ఎంఈ ,సర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామాత్యులు -- కొండపల్లి శ్రీనివాస్.**









ప్రజాస్వామ్యం / గజపతినగరం: గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల స్థాయి నుంచి 100 పడకల ఆధునిక ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి, అన్ని మౌలిక వసతులతో సమగ్రంగా అభివృద్ధి చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామాత్యులు శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం గజపతినగరం ఏరియా ఆసుపత్రి నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ, 2019లో మంజూరైన ఈ ఆసుపత్రి నిర్మాణ పనులు వివిధ కారణాల వల్ల నిలిచిపోయాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రూ.17 కోట్ల వ్యయంతో పనులను పునఃప్రారంభించి విజయవంతంగా పూర్తిచేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్మాణ నాణ్యత అద్భుతంగా ఉందని ప్రశంసిస్తూ కాంట్రాక్టర్ రాజేష్‌ను అభినందించారు.ఆసుపత్రిలో వైద్య సేవలు గణనీయంగా పెరిగినట్లు మంత్రి వివరించారు. 2023--24 సంవత్సరంలో లక్షా 45 వేల ల్యాబ్ పరీక్షలు జరగగా, 2024--25లో అవి లక్షా 75 వేల వరకు పెరిగాయని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంకా రెండు నెలలు మిగిలి ఉండగానే ల్యాబ్ టెస్టులు మూడు లక్షల 20 వేల వరకు పెరగడం డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది సేవాభావానికి నిదర్శనమని అన్నారు. ఇంతటి వేగవంతమైన వృద్ధిని తాను ఇప్పటివరకు ఎక్కడా చూడలేదని మంత్రి పేర్కొన్నారు.డాక్టర్ల సంఖ్య 31 నుంచి 98కి పెరిగిందని, గతంలో 8 స్పెషాలిటీలే ఉండగా ప్రస్తుతం 15 స్పెషాలిటీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏరియా హాస్పిటల్‌లో లాప్రోస్కోపిక్ సర్జరీ సౌకర్యం కల్పించడం గర్వకారణమని అన్నారు. అవసరమైన వైద్య పరికరాల మంజూరుపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని స్పష్టం చేశారు.ప్రజలకు సేవలందించే సమయంలో డాక్టర్లు, సిబ్బంది ఓపికతో విని, అవసరమైన పరీక్షలు, మందులు మాత్రమే సూచించి, రోగులు ఆసుపత్రి నుంచి సంతృప్తితో వెళ్లేలా వైద్య సేవలు ఉండాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకంతో వచ్చే ప్రజల అంచనాలకు అనుగుణంగా వైద్యులు పనిచేయాలన్నారు.ఎన్‌క్యూఏఎస్ (చీూూూ) సర్టిఫికేషన్ పొందేందుకు అవసరమైన ఫైర్ అలారమ్ సిస్టమ్, ఇతర మౌలిక వసతుల కోసం తక్షణమే నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. హెల్త్ సెక్రటరీ సమన్వయంతో అవసరమైన నిధులను వెంటనే శాంక్షన్ చేసినట్లు వెల్లడించారు. ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత శాఖామాత్యులు కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి రథసారథిగా నిలుస్తూ ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కార దిశగా పనిచేస్తున్న జిల్లా కలెక్టర్ గారి సేవలు అభినందనీయమని అన్నారు. గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, సిబ్బంది పనితీరును ప్రశంసిస్తూ, అత్యవసర హార్ట్ అటాక్ కేసుల్లో సకాలంలో చికిత్స అందించి ఈ ఏడాది 38 మంది ప్రాణాలను కాపాడటం గొప్ప విజయమన్నారు. గతంలో కేవలం గ్రౌండ్ ఫ్లోర్‌తో పరిమితమైన ఆసుపత్రిని నేడు మూడు అంతస్తులతో, 100 పడకల సదుపాయాలతో ఆధునికికరించడం చారిత్రాత్మక ముందడుగని తెలిపారు. ఇందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు.ప్రస్తుతం ఆసుపత్రిలో అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ సేవలతో పాటు 24 గంటల అత్యవసర సేవలు అందుబాటులోఉన్నాయని, కార్పొరేట్ ఆసుపత్రులకు సరితూగే వైద్య సేవలు ఇక్కడే లభిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు ఈ ప్రభుత్వ వైద్య సేవలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రి సేవలను ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన ఆధునిక వైద్య పరికరాలు, పక్కా భవనం, అదనపు సిబ్బంది సమకూరిన నేపథ్యంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే స్థితికి ఆసుపత్రి చేరుకుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అన్ని వైద్య సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీపీ, షుగర్ వంటి నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు లక్షణాలు లేకుండానే ముప్పుగా మారుతున్నాయని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ ఎంతో కీలకమని, తొలిదశలో గుర్తిస్తే చికిత్స సులభంగా సాధ్యమవుతుందన్నారు. చిన్న జబ్బులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందాలని ప్రజలను కోరారు.ఆసుపత్రిలో అనేక విభాగాలకు చెందిన నిపుణ వైద్యులు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఎలాంటి సందేహం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రి సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెకండరీ హెల్త్ అండ్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కెవిఎస్ చక్రధర్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జీవన రాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్ కుమార్, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాల్ రాజు, మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి , బిజెపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని ,సీరంరెడ్డి రామ్ కుమార్, వైకుంఠం ప్రదీప్ కుమార్ ,సర్పంచ్ నరవ కొండమ్మ , పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల మనోభావాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ - మంత్రి సత్యకుమార్ యాదవ్.

**వికాసిత్ భారత్ నిర్మాణం, స్వర్ణాంధ్ర కు పునాదుల వేసే దిశగా కేంద్ర బడ్జెట్ ఉందని ప్రధాని మోదీ కి ధన్యవాదాలు**

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్.**





ప్రజాస్వామ్యం / విజయనగరం:దేశ ప్రజల మనోభావాల అనుగుణం గా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యప్రసాద్ యాదవ్ అన్నారు. విజయనగరం లో ఒక ప్రైవేట్ హోటల్ లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశం లో మాట్లాడుతూ దేశ సుస్థిర అభివృద్ధి కొరకు ఆత్మనిర్భర భారత్, వికసిత్ భారత్ నిర్మాణానికి పునాదులు ఈ వేసేదిశగా బడ్జెట్ ఉందని వ్యాఖ్యానించారు. మూడు కర్తవ్యాలను గుర్తుచేస్తూ దేశ ఆర్థికవ్యవస్థను ఈ బడ్జెట్ బలోపేతం చేస్తుందన్నారు. ప్రజల మనోభావాలు ఆకాంక్షలకు అనుగుణం గా వారి సామర్థ్యాలను పెంచేదిశగా ఉందన్నారు. ప్రధాని ఆలోచనలో పుట్టిన సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ ద్వారా అందరికీ ఆర్థిక ఫలాలు అందించే దిశగా బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. తయారీ రంగం లో ఊతమిచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ లో సెమీకండక్టర్ పరిశ్రమకు 14000 కోట్ల వ్యయంచేయడం వలన దేశం సెమీకండక్టర్ హబ్ గా అవతరిస్తుందన్నారు. అదేవిధంగా రేర్ ఎర్త్ మినరల్స్ , బుల్క్ డ్రగ్ పార్క్, బయో ఫార్మా శక్తి రంగాల్లో పురోగతి సాధించడానికి బడ్జెట్ దోహదం చేస్తుందని అన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేదిశగా 15000 వేల పాఠశాలల్లో ల్యాబ్స్ ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. దేశం లో ప్రవేశపెట్టనున్న ఐదు మెడికల్ టూరిజం హబ్ లలో ఆంధ్రప్రదేశ్ ఎంపిక అయినట్లు చెప్పారు. ఐటీ రంగం లో ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఈ బడ్జెట్ లో పెద్దయెత్తున ప్రణాళిక చేసినట్లు వివరించారు. దేశం లో మౌలిక సదుపాయాలు కల్పన అందించేందుకు పి ఏం గతిశక్తి పథకం క్రింద నూట పదకొండు లక్షల కోట్ల వ్యయం తో హై స్పీడ్ రైల్వే కారిడార్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోర్టుల అభివృద్ధి, ప్రత్యేక వాయు రవాణా కారిడార్ ఏర్పాటు,

ఎనర్జీ రంగం, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ పై దృష్టి సారించినట్లు చెప్పారు. పట్టణాల్లో మౌలిక సదుపాయాలు కోసం ప్రత్యేకంగా పట్టణ ఆర్థిక మండలి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మహిళల ఆర్థిక స్వావలంబన కొరకు 670 మండలాల్లో ఇరవైలక్షల ఆర్థిక ప్రోత్సాహకం తో షీ మార్టు లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జి రామ్ జి పథకం కోసం ఈ బడ్జెట్ లో తొంభై ఆరు వేల కోట్లు రూపాయిలు మంజూరు చేసినట్లు వివరించారు. వ్యవసాయ రంగం లో అధిక విలువ ఉత్పత్తుల ఎగుమతుల వల్ల ఆర్థిక పురోగతి సాధిస్తుందని అన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మన గౌరవ

ప్రధాన మంత్రి విజన్ 2047 లక్ష్యం గా ఈ బడ్జెట్ లో ముఖ్యంగా ఎం ఎస్ ఎం ఈ ఏర్పాట్ల కోసం అనేకమైన సంస్కరణలు తీసుకు రావడం జరిగిందన్నారు. ఈక్విటీ సపోర్ట్ అని చెప్పి కొత్త విధా నం తీసుకొచ్చారు. సుమారు పదివేల కోట్ల రూపాయలను దీనికి కేటాయిస్తూ 'సెల్ఫ్ రిలయంట్ ఇండియా ఫండ్' అని ఎన్.ఎస్.ఐ.సి (నేషనల్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ కార్పొరేషన్) ద్వారా ఈ వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏదైతే ఉందని ఎం ఎస్ ఎం ఈ ఇండస్ట్రీస్‌కి పెద్ద ఎత్తున సహకారం చేయడానికి ఒక కొత్త ప్లాట్‌ఫారమ్ ఎస్టాబ్లిష్ చేయడం సంతోషదాయకమన్నారు. వికాసిత్ భారత్ నిర్మాణం, స్వర్ణాంధ్ర కు పునాదుల వేసే దిశగా కేంద్ర బడ్జెట్ ఉందని ప్రధాని మోదీ కి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమం లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ , విజయనగరం శాసన సభ్యురాలు అదితి గజపతి రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలపై వినతులను సకాలంలో పరిష్కరించాలి

**- వినతులు పరిష్కారంలో ఆలసత్యం వహిస్తే సహించేది లేదు**


**- 380 వినతుల స్వీకరణ -- రెవెన్యుకు సంబంధించిన 188 వినతులు**


**- పి.జి.ఆర్.ఎస్., రెవెన్యు క్లినిక్కు విశేష స్పందన**

**- అన్ని శాఖలు ఇ.పి.టి.ఎస్.లో డాక్యుమెంటు అపలోడ్ చేయాలి**

**జిల్లా జాయింట్ కలక్టరు - సేతు మాధవన్**

పజాస్వామ్యం/ విజయనగరం: సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (గ్రా+=ూ) మరియు 'రెవెన్యూ క్లినిక్' కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుండి ప్రజలు తరలివచ్చి తమ సమస్కలపై వినతి పత్రాలు, ఫిర్యాదులు అందజేసారు.






రెవెన్యూపై ఫోకస్: అందిన మొత్తం 380 వినతుల్లో అత్యధికంగా 188 రెవెన్యూ శాఖవే ఉన్నాయి. పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ వినతుల పరిష్కారంలో వేగం పెంచాలని, వినతులు పరిష్కారంలో ఆలసత్యం వహిస్తే సహించేది లేదని, రెవెన్యూ సమస్యలపై వినతులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలక్టరు సేతు మాధవన్ రెవెన్యూ అధికారులు, సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా వచ్చిన వినతులు: రెవెన్యూ: 188, డిఆర్డిఎ-48, పంచాయతీ రాజ్: 25, మున్సిపల్-7 విద్యుత్ శాఖ-3, హౌసింగు-4, డిఎం అండ్ హెచ్ఒ-9, గ్రామ సచివాలయ శాఖ-53, విద్య శాఖ-5, ఇతర శాఖలు-38 వినతులు వచ్చాయి.

ఇ.టి.పి.ఎస్.లో అన్ని శాఖలు డాక్యుమెంటులు అపలోడ్ చేయాలి: ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం అన్ని శాఖలు తమ కార్యాలయం యొక్క రికార్డులను డిజిటిలైజేషను చేయాలని, తమ శాఖల యొక్క పూర్తి సమాచారం (ప్రోసిడింగ్సు, సర్కులర్లు, కోర్టు తీర్పులు, రికార్డులు, డాక్యుమెంట్స్, నోటిఫికేషన్లు, ప్రగతి సమాచారం తప్పనిసరిగా ప్రతిరోజు అపలోడ్ చేయాలని జిల్లా అధికారులను జాయింట్ కలక్టరు సేతు మాధవన్ ఆదేశించారు.

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022